క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఇండోర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌జీ కాలేజీ, దేవరకొండ రోడ్డు, బీట్ మార్కెట్, రాక్ హిల్స్ కాలనీ, మీర్ బాగ్, శ్రీనగర్ కాలనీ, మోహన్‌రెడ్డి కాలనీ, సూర్యనగర్, సాయి శ్రీకాలనీ, హౌసింగ్ బోర్డు, రవీంద్రనగర్, ఏకలవ్య స్కూల్, శివాజీ నగర్, గాంధీనగర్, ఎన్‌జీ కాలనీ, రామగిరి, శివరాం నగర్, సావర్కర్ నగర్, హైదరాబాద్ రోడ్డు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ కిట్లు పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఇంటాస్ ఫౌండేషన్, సదరం విభాగంలో ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నగేష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కీర్తి, ఫిజీషియన్ డాక్టర్ సైదులు, డాక్టర్ హనుమానాయక్, డాక్టర్ రజని, రత్న, స్వప్న, రఫి, ఇజాజ్, ఫౌండేషన్ సభ్యులు కరుణాకర్, శివ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అవగాహన శిబిరం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మహిళల అక్రమ రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై నిర్వహిస్తున్న అవగాహన శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ మల్లేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు



కట్టంగూర్ : కట్టంగూర్ ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్) తహసీల్దార్‌గా నార్కట్‌పల్లి తహసీల్దార్ లక్కరాజు వెంకటేశ్వరరావు శనివారం ఉద్యోగ బాధ్యత చేపట్టారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ జి.ప్రసాద్ హైదరాబాద్ సచివాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌బాబు

తిప్పర్తి : పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని తిప్పర్తి వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌బాబు అన్నారు. శనివారం తిప్పర్తి పీహెచ్‌సీలో అంతర్జాతీయ పొగాకు నిషేధ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మమత, సిబ్బంది పార్వతి, హోమ్‌గార్డు ఎంఏ.బాసిత్ తదితరులు ఉన్నారు.

టీచర్ల సర్దుబాటు వద్దు

నల్లగొండ : ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశం, పి.వెంకులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ప్రకటిస్తూనే.. మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడం తగదని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి తరగతికి ఒకగది ఉండేలా చూడాలని కోరారు.

మెమోను నిలుపుదల చేయాలి

ఉపాధ్యాయులకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన హేతుబద్ధీకరణ మెమోను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని పంచాయత్ రాజ్ ఉపాధ్యాయ సంఘం నేత కె.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

గ్రామీణ రోడ్లను విస్తరించేలా..



కొనసాగుతున్న నేరటోనిగూడెం బీటీ రోడ్డు పనులు

- మునుగోడు, చండూరు మండలాల్లో ఇరుకు రోడ్లకు మోక్షం
- 3.7 మీటర్ల వెడల్పుతో నిర్మించేలా గతంలో నిధులు మంజూరు
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చొరవతో 5.5 మీటర్లుగా మార్పు
- అదనంగా రూ.39.04 కోట్లు మంజూరు

మునుగోడు: మునుగోడు, చండూరు మండలాల్లో పలు గ్రామాలకు వెళ్లే ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడిన వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు కేవలం 3.7 మీటర్లు వెడల్పు మాత్రమే ఉన్న గ్రామీణ బీటీరోడ్లు ఇకనుంచి 5.5 మీటర్లుగా విస్తరించనున్నారు. ఆయా మండలాల్లో వివిధ గ్రామాల బీటీరోడ్లు మొదట 3.7 మీటర్ల వెడల్పుతోనే నిర్మించేలా అధికారులు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగించారు. ఈ విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మూడు నెలల క్రితం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తీర్ణం పెరగాలని, మరికొంత వెడల్పు పెంచి పనులు చేపట్టాలని ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో సంబంధిత అధికారులు మరో రెండు మీటర్ల వెడల్పు పెంచి నిర్మించేందుకు అవసరమయ్యే నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు నెలల క్రితం ఉన్నతాధికారులకు ఈ ప్రతిపాదనలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో మాట్లాడి అదనంగా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

రెండు మండలాల్లో 20 బీటీ రోడ్లు

మునుగోడు సబ్ డివిజన్ పరిధిలో మునుగోడు, చండూరు మండలాల్లోని 20 గ్రామాలకు నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల నిర్మాణ నిధుల నుంచి ఏడాది క్రితం రూ.35.76 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో 39.77 కిలోమీటర్ల పొడవు 3.7 మీటర్ల వెడల్పుతో రోడ్ల నిర్మిస్తున్నారు. ఇంతలోనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్ల వెడల్పు పెంచాలని సూచించడంతో కొందరు కాంట్రాక్టర్లు నిధులు మంజూరైన తరువాతే పనులు చేస్తామని నిలిపివేశారు. దాదాపు 2 నెలలపాటు నిలిచిపోయిన పనులు వారం రోజుల క్రితం అదనంగా రూ.39.04 కోట్లు మంజూరు కావడంతో తిరిగి ప్రారంభమయ్యాయి. 20 రోడ్లకు మొత్తం రూ.74.80 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

5.7 మీటర్ల వెడల్పుతో రోడ్లు నిర్మిస్తాం..



సీఆర్ఆర్ నిధుల నుంచి మునుగోడు, చండూరు మండలాల్లోని 20 గ్రామాలకు 39.77 కిలో మీటర్ల దూరం 3.7 మీటర్ల వెడల్పుతో రోడ్లు వేసేందుకు రూ.35.76 కోట్ల నిధులు గతంలో మంజూరయ్యాయి. అయితే రోడ్ల వెడల్పు 5.7 మీటర్లకు పెంచాలని ఎమ్మెల్యే సూచించారు. అందుకు అవసరమైన రూ.39.04 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో 20 రోడ్లు మొత్తం రూ.74.80 కోట్లతో 5.7 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నాం.

– సతీష్ రెడ్డి, ఏఈ, మునుగోడు

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



పదవీ విరమణ పొందిన వారితో ఎస్పీ

నల్లగొండ : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో దాదాపు 40 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్ఐ ఎం.డి ఖాసీం, ఏఎస్ఐలు కె.నరసింహారెడ్డి, పి.శేఖర్‌లను శనివారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వారికి అందాల్సిన ఆర్థిక సదుపాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



రోడ్డు వెంట ఏర్పాటు చేసిన షేడ్‌నెట్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



రోడ్డు మీదకు వచ్చి కట్టడాలను తొలగిస్తున్న జేసీబీ

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, రహదారులపై అక్రమంగా వేసిన పాకలను శనివారం మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు కలిపి జేసీబీతో తొలగించారు. ప్రకాశం బజారులో దుకాణాల ముందు రోడ్డు మీది వరకు ఏర్పాటు చేసిన కట్టడాలు, తోరణాలు, బోర్డులను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ లక్ష్మయ్య మాట్లాడుతూ దుకాణాలు ముందు రోడ్డు మీది వరకు బోర్డులు, దిమ్మెలు, పాకలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి షాపుల ముందు కట్టడాలు, తోరణాలు, పాకలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్‌పెక్టర్లు నాగరాజు, గడ్డం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం పూజలు చేస్తున్న పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు



గట్టుప్పల్‌లో గణపతి పూజ చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో శనివారం గ్రామ దేవతలు శ్రీముత్యాలమ్మ, మారెమ్మ, కోట మైసమ్మ, కట్ట మైసమ్మ దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా కొనసాగింది. బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణశాస్త్రి, అర్చక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఆయా దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు ప్రతి ఇంటి నుంచి నాలుగు బోనాలను తీసుకెళ్లి నలుగురు గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, విగ్రహాల దాత కృష్ణమాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు ఐతరాజు యాదయ్య, సట్టు సత్తయ్య, సామ కొండల్ రెడ్డి, పుల్లెంల అచ్చాలు, రాధారపు భిక్షపతి, మిర్యాల రాములు, దుబ్బాక శ్రీధర్, కమ్మంపాటి రాములు, గోదల వెంకట్‌రెడ్డి, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, అలుగుబెల్లి వివేక్‌రెడ్డి, జేరిపోతుల భరత్, పజ్జూరు వెంకట్‌రెడ్డి, సామ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్‌లో పార్వతీదేవి విగ్రహం

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండల కేంద్రంలోని శివాలయంలో పార్వతీదేవి విగ్రహ ప్రతిష్టామహోత్సవంలో భాగంగా మొదటి రోజు వేద పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడ వెంకటరమణ శర్మ, ఇడెం కైలాసం, గంజి కృష్ణయ్య, కర్నాటి వెంకటేశం, బావండ్ల శ్రీనివాసులు, దాత రాపోలు మధుసూదన్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరుడికి బోనాలు

గట్టుప్పల్‌లో కంఠమహేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం బోనాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ప్రత్యేక పూజలు నిర్వహించగా వారిని గౌడ సంఘం అధ్యక్షుడు బండారు చంద్రయ్య సత్కరించారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా ఏదీ?

- గ్రామాల్లో సర్వే చేసి అర్హులను గుర్తించిన మండల అధికారులు
- జిల్లా అధికారులకు చేరిన నివేదిక
- నేటికీ విడుదలకాని లబ్ధిదారుల జాబితా
- ఎదురుచూపుల్లో దరఖాస్తుదారులు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)



కేతేపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ పథకం నమూనా ఇల్లు

కేతేపల్లి: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో జాప్యం జరుగుతోంది. ఈ పథకం కింద ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ అధికారులు ఇటీవల ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన ఇళ్ల జాబితాను విడుదల చేశారు. కానీ లబ్ధిదారుల జాబితాను వెల్లడించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో ఆశావహులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

జిల్లా అధికారులకు చేరిన నివేదిక

అర్హులను ఎంపిక చేసేందుకు మండల స్థాయి అధికారి, పంచాయతీ అధికారులతో కూడిన కమిటీలు వేశారు. ఆయా కమిటీలు గ్రామాల్లో పర్యటించి ప్రజా పాలనలో ఇందిరమ్మ పథకానికి దరఖాస్తు చేస్తున్న వారిని కలసి సర్వే నిర్వహించి అర్హుల జాబితాను మండల అధికారులకు అందజేశారు. ఆ జాబితాను ఎంపీడీఓ.. జిల్లా అధికారులకు పంపించినప్పటికీ ఇప్పటి వరకు అర్హుల తుది జాబితాను విడుదల చేయలేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్లు ఎవరిని వరిస్తాయోనని ఇళ్లులేని నిరుపేదలకు ఆశగా ఎదురుచూస్తున్నారు.

480 గృహాలు మంజూరు

మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇప్పలగూడెం గ్రామంలో 34 గృహాలు మంజూరు కాగా నిర్మాణంలో ఉన్నాయి. కాగా మొదటి విడతలో మండలకేంద్రానికి ఇళ్లు మంజూరు చేయడం లేదని తెలిసింది. మిగిలిన 15 గ్రామ పంచాయతీల్లో 480 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయి. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్న వారినే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

జిల్లా అధికారులకు జాబితా పంపించాం



ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించేందుకు అన్ని గ్రామాల్లో పంచాయతీ అధికారులు సర్వే చేశారు. వారు ఇచ్చిన అర్హుల జాబితాను జిల్లా అధికారులకు పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి లబ్ధిదారుల జాబితా పంపించిన వెంటనే గ్రామాల వారీగా వెల్లడిస్తాం. ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారుల జాబితా వచ్చే అవకాశముంది.

– బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కేతేపల్లి

అహల్యాబాయికి ఘన నివాళి



నల్లగొండలోని బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆ పార్టీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : పుణ్యశ్లోక రాజమాత, మహా రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని శనివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం కార్యాలయం నుంచి స్థానిక సుభాష్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. దేశ ప్రజలకు ఆమె చేసిన కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పల్లెబోయిన శ్యాంసుందర్, చినమోని రాములు, పకీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, గడ్డం మహేష్, సరిత, రావెళ్ల కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

నకిరేకల్: నకిరేకల్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం ఉద్యోగులు సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిక్కు రవీందర్, కోట రామచొక్కం, ఉత్తరమ్మ, భాస్కర్, యూసఫ్, ఆర్.లింగయ్య, బి.జనార్దన్, డి.జగదీష్‌బాబు జన్మదిన వేడుకలు జరిపి వారిచేత కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వంటల రామలింగం, ప్రతినిధులు కందుల సోమయ్య, బాదిని లింగయ్య, వీరమళ్ళ రవీందర్, తోనుపునూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాలి



నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నల్లగొండ : జూనియర్ లెక్చరర్లకు రెండవ వార్షికోత్సవ ఇంక్రిమెంట్ మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ శనివారం నల్లగొండలోని కేపీఎం కళాశాలలో కొనసాగుతున్న స్పాట్ వ్యాల్యుయేషన్ క్యాంపులో అధ్యాపకులు నిరసన తెలిపారు. 2023లో రెగ్యులరైన జూనియర్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రొబేషన్ పీరియడ్ పూర్తిచేసినప్పటికీ ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీజేఎల్ఎం సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రజినీకాంత్, లింగమూర్తి, కృష్ణ, వెంకటాచారి, భాస్కర్, అనిత, విజయభారతి, గౌసియా, శ్వేత, పరశురాం, రవి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో నేడు రక్తదాన శిబిరం

మునుగోడు : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

ఉద్యోగం బాధ్యతాయుతమైనది



ఉద్యోగులను సన్మానిస్తున్న జడ్జీలు

రామగిరి(నల్లగొండ): న్యాయశాఖలో ఉద్యోగం బాధ్యయుతమైనదని జిల్లా మొదటి అదనపు జడ్జి సంపూర్ణ ఆనంద్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన కోర్టు ఉద్యోగులు ఎండి. మౌలానా, ఎం.శేఖర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు జడ్జి కులకర్ణి, జూనియర్ సివిల్ జడ్జి శిరీష, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాతంగి వీరబాబు, నాయకులు గిరి, వంశీ, లతీఫ్ పాషా, సాగర్ రెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి



ఎంపీడీఓ భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మునుగోడు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మునుగోడులో ఎంపీడీఓ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్ మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన ఇళ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకొని అనర్హులకు అందించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసి నవారిలో మండల కమిటీ సభ్యులు మిర్యాల భరత్, యసరాని శ్రీను తదితరులు ఉన్నారు.

తానేదార్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవం



పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

తిప్పర్తి : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ద్రోణార్జున, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన నృత్య శిక్షణ శిబిరాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఆల్ఫా స్కూల్‌లో సద్దేంద్ర యోగి కళా వేదిక ఆధ్వర్యంలో, రామగిరిలోని నాగదుర్గా నృత్యాలయంలో నెల రోజులు కొనసాగుతున్న కూచిపూడి ఉచిత నృత్య శిబిరాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాల్లో శిక్షకులు పాలబిందెల బాలు, గుత్తా నాగదుర్గా, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.





ఆల్ఫా స్కూల్, నాగదుర్గ నృత్యాలయంలో నృత్య శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శిక్షకులు